కాంగ్రెస్‌లో బుజ్జగింపుల పర్వం

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కిగౌడ్. తన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించిన వారిని బుజ్జగించే పనిలో పడ్డారు. అసంతృప్త నాయకులను సోమవారం సోమవారం వారి ఇండ్ల వద్దకు వెళ్లి మాట్లాడారు. టిక్కెట్ ఖరారైనప్పటి నుంచీ సీనియర్లు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. నియోజకవర్గ సమన్వయకర్తగా పనిచేసిన మల్‌రెడ్డి రాంరెడ్డి తనకే టిక్కెట్ వస్తుందని భావించినప్పటికీ ఆఖరి క్షణంలో పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్‌వైపే పార్టీ మొగ్గుచూపింది. రెండవ జాబితాలో ఆయన పేరును ప్రకటించడంతో ఇక్కడ నుంచి టిక్కెట్ రేసులో ఉన్న వారు ఒక్కసారిగా అవాక్కయ్యారు. దీంతో పార్టీ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కినుక వహించారు.



జక్కిడి ప్రభాకర్‌రెడ్డి నివాసంలో చర్చలు జరిపిన అనంతరం కార్యకర్తలతో మధుయాష్కిగౌడ్

- మొదట నియోజకవర్గ సమన్వయ కర్తగా ఉన్న మల్‌రెడ్డి రాంరెడ్డి నివాసానికి వెళ్లి కలిశారు. భవిష్యత్తులో పార్టీలో సముచిత స్థానం కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని రాంరెడ్డికి మధుయాష్కి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.
- మరో అసంతృప్తి నేత, పీసీసీ కార్యదర్శిగా ఉన్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనతో గంటకు పైగా చర్చలు జరిపారు. పార్టీ పరిస్థితిపై ఇరువురు చర్చించామని జక్కిడి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీకి కట్టుబడి ఉంటానని జక్కిడి పేర్కొన్నట్లు సమాచారం.

క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్-2 డిపో నుంచి నడిచే బస్ సర్వీసులకు సంబంధించి ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు మంగళవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్ నుంచి ఉద్గిర్, బీచ్‌కుండ్, జుకల్, కొల్లాపూర్, విజయవాడ, బైలడిల్ల, జగదల్‌పూర్, బెంగుళూరు, తొర్రూర్ వైపు వెళ్లే బస్‌లకు సంబంధించి ప్రయాణికులు తగు సూచనలు, ఫిర్యాదులు 9959226249 సెల్ నంబర్‌లో తెలియజేయాలన్నారు.

మనీష్ కుంటుంబ సభ్యులను పరామర్శించిన మధుయాష్కిగౌడ్



మనీష్ కుంటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కిగౌడ్

నాగోలు: గుంతలో పడి మృతి చెందిన మనీష్ కుటుంబసభ్యులను ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కిగౌడ్ సోమవారం పరామర్శించారు. నాగోల్ డివిజన్లో బ్లైండ్స్ కాలనీలో నివాసం ఉండే మనీష్ ఆదివారం గుంతలో పడి మృతి చెందాడు. కొత్తపేట మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్ రూ. 20 వేల ఆర్థిక సాయం అందించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్ మామ, లింగాల కిషోర్, కాలనీ ప్రెసిడెంట్ రవి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ శాతవాహన నగర్ మహిళా సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం కాలనీలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉమారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నాగలత, ఉపాధ్యక్షులుగా వసంత, కార్యనిర్వాహక కార్యదర్శిగా కే.మాధవి, సాంస్కృతిక కార్యదర్శిగా చందన ఎన్నికయ్యారు.

కుల సంఘాలతో అందెల భేటీ



మాట్లాడుతున్న అందెల శ్రీరాములు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో పలు కుల సంఘాల సభ్యులతో బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం బాలాపూర్ బస్తీల్లో కలియ తిరిగి కమలం పువ్వు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగార్జునబాబు, వెంకట్‌రెడ్డి, నరేశ్, రంగనాథ్, కురుమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీ పథకాలు పేదలకు వరం

- కాంగ్రెస్ అభ్యర్థి పరమేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి పరమేశ్వర్‌రెడ్డి

రామంతాపూర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రామంతాపూర్‌లోని గుప్తా గార్డెన్‌లోని అపార్ట్‌మెంట్లు గృహ సముదాయాల సమావేశాన్ని నిర్వహించారు. ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి మందముల పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన గ్యారంటీ పథకాలు పేదలకు వరం అన్నారు. విజయం సాధించిన తర్వాత ప్రజలకు అందుబాటులో ఉండి ప్రతి డివిజన్‌లో క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేత కంది ఆదిరెడ్డి, యువజన కాంగ్రెస్ నేత అరుణ్, పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



అబ్దుల్ మన్నాన్ (ఫైల్)

పహాడీషరీఫ్: వ్యక్తి అదృశ్యమైన ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాదే ముస్తఫా బస్తీకి చెందిన అబ్దుల్ మన్నాన్ (45) మీర్‌చౌక్‌లో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 20వ తేదీన పని నిమిత్తం వెళ్లిన అతను తిరిగి రాలేదు. అతని సెల్‌ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ కావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. బంధువులు, స్నేహితుల వద్ద అబ్దుల్ ఆచూకీ కోసం వెతికారు. అయినా జాడ తెలియలేదు. దీంతో అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గానీ, 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

త్వరలోనే ఓపెన్ జిమ్ ఏర్పాటు

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: అటవీశాఖ నుంచి అనుమతి రానందున అనుకున్న సమయంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయలేకపోయామని, త్వరలోనే అన్ని అనుమతులు తీసుకుని ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని మహావీర్ హరిణ వనస్థలి జాతీయ పార్కు వాకర్స్‌ను బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కలిసి ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. మహావీర్ హరిణి వనస్థలి జాతీయ పార్కులోని వాకర్స్‌కు వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు.

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ప్రారంభం



విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా హయత్‌నగర్ క్రీడా కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

మన్సూరాబాద్: కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (క్రీడా) హయత్‌నగర్ కార్యాలయంలో విజిలెన్స్ అవగహన వారోత్సవాలను సంస్థ సంచాలకులు డాక్టర్ వినోద్‌సింగ్, విజిలెన్స్ అధికారి డాక్టర్ ఎం. శ్రీనివాసరావులు ముఖ్యఅతిథులుగా హాజరై సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏడాది విజిలెన్స్ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు స్పష్టంచేశారు. ఉద్యోగులకు అవినీతి, అనైతిక చర్యల నిర్మూలన, విజిలెన్స్ సంబంధిత విషయాలపై విస్తృతంగా అవగహన కల్పించామన్నారు.

బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక విజయవంతం



వివాహ పరిచయ వేదిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

వనస్థలిపురం: తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వనస్థలిపురంలోని రామాలయంలో ఆదివారం నిర్వహించిన బ్రాహ్మణ వధూ వరుల 15వ వార్షిక పరిచయ వేదిక విజయవంతం అయిందని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పోచంపల్లి శ్రీధర్‌రావు, నందిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా 527 మంది బ్రాహ్మణ యువత తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు బసవరాజు శ్రీనివాస్, మంగపతి రావు, రాజేశ్వర్‌రావు, శేషాచలపతి, సత్యనారాయణ మూర్తి, నారాయణరావు, వాసుదేవరావు, ప్రసాద్, రమణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలు అమలయ్యేలా చూడాలి

రాష్ట్రపతిని కలిసిన డ్వాబ్ బృందం



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో డ్వాబ్ బృందం డ్వాబ్ బృందం

వనస్థలిపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంధుల కోసం తీసుకువచ్చిన కొత్త చట్టాలను సక్రమంగా అమలు చేయడం లేదని, వాటిని అమలు చేసే విధంగా చూడాలని కోరుతూ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్ (డ్వాబ్) బృందం సోమవారం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును రాష్ట్రపతి భవన్‌లో కలసి విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా అఖిల భారత అంధుల సమాఖ్య (ఏబీసీబీ) ఉపాధ్యక్షుడు, డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పొనుగోటి చొక్కారావు అంధుల సమస్యలు అంధులకు మాత్రమే అర్థం అవుతాయని, వారికి రాష్ట్రస్థాయిలో దివ్యాంగుడైన కమిషనర్ ఉండాలని చట్టం చెబుతున్నప్పటికి ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని రాష్ట్రపతి దృష్టికి తీసుకువచ్చారు. దివ్యాంగుల హక్కుల రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై రాష్ట్రపతి సానుకూలంగా స్పందించి వీటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వివరణ కోరతానని, వాటిని అమలు అయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారని చొక్కారావు తెలిపారు. కార్యక్రమంలో ఏబీసీబీ కార్యవర్గ సభ్యులు రాత్లావత్‌స్వామి నాయక్, రేణుక, శ్వేత, నాగరాజు పాల్గొన్నారు.

న్యాయం చేయండి..

కృష్ణానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌వాసులు



వంపుగూడలో సమావేశంలో బాధితులు

కుషాయిగూడ: ఎన్నో కలలు కని అప్పు చేసి కొనుగోలు చేసిన మా ప్లాట్లు మాకు దక్కేలా చూసి న్యాయం చేయాలని వంపుగూడ కృష్ణానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు కోరుతున్నారు. మా ప్లాట్లను కబ్జా చేసేందుకు కుట్ర పన్నుతున్న వ్యక్తి నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ ప్లాట్ల యజమానులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు భువన్‌రెడ్డి, కోటిరెడ్డితో పాటు పలువురు మాట్లాడుతూ వంపుగూడలోని సర్వే నంబర్లు 639బై1, 643బై1, 644బై1, 647బై1, 648, 654లలోని 61.39 ఎకరాల్లో 1971లో వంపుగూడ గ్రామపంచాయతీ లే అవుట్ చేసి ప్లాట్లు విక్రయించినట్లు తెలిపారు. ఈ క్రమంలో 1983 నుంచి 2000 సంవత్సరం వరకు పట్టాదారుల నుంచి 706 ప్లాట్లు కొనుగోలు చేశామన్నారు. ఇంటి అనుమతులు పొందిన వారు ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా.. మరికొంత మంది ప్రహరీల నిర్మాణం చేసుకున్నట్లు తెలిపారు. అయితే 2000 సంవత్సరంలో ప్లాట్లను కబ్జా చేసేందుకు కుట్ర చేయగా న్యాయ పోరాటం చేసి రెవెన్యూ అధికారులు, కోర్టును ఆశ్రయించామన్నారు. అధికారులు, కోర్టు తమకు అనుకూలంగా తీర్పునిచ్చిందన్నారు. అయినా కబ్జాదారులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయారు. న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

మలక్‌పేట బరిలో యుగ తులసి పార్టీ



ఇందూరి లత

సైదాబాద్: మలక్‌పేట నియోజకవర్గ ఎన్నికల బరిలో యుగ తులసి పార్టీ పోటీ చేస్తోంది. సోమవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.శివకుమార్ ఏడు నియోజకవర్గాలకు తమ అభ్యర్థుల జాబితా విడుదల చేసారు. అందులో మలక్‌పేట అభ్యర్థిగా సైదాబాద్ డివిజన్ బీ-బ్లాక్ క్వార్టర్స్‌లో నివసించే ఇందూరి లతను ప్రకటించారు. బీసీ వర్గానికి చెందిన ఇందూరి లత డిగ్రీ పూర్తి చేసారు. వ్యాపారిగా వ్యవహరిస్తూనే గో సంరక్షణ సభ్యురాలిగా ఆమె సేవలు అందిస్తున్నారు. పార్టీ తనకు టికెట్ కేటాయించడంపై సంతోషం వ్యక్తం చేశారు.

మలక్‌పేట బీఎస్‌పీ అభ్యర్థిగా అల్లోల రమేష్



సైదాబాద్: మలక్‌పేట నియోజకవర్గ బీఎస్‌పీ టికెట్ అల్లోల రమేష్‌కు దక్కింది. సోమవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విడుదల చేసిన బీఎస్‌పీ అభ్యర్థుల రెండో జాబితాలో ఆయన పేరును ప్రకటించారు. మలక్‌పేట నియోజకవర్గం సైదాబాద్ డివిజన్‌లో నివసించే అల్లోల రమేష్ 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ మలక్‌పేట బీఎస్‌పీ అభ్యర్థిగా పోటీ చేశారు. దాంతో ఆయన ఇక్కడ రెండవ సారి బీఎస్‌పీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. సైదాబాద్‌లో వ్యాపారిగా స్థిరపడిన ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

5న వైశ్యుల బిజినెస్ మీట్

కాచిగూడ: వాసవి బిజినెస్ గ్రూప్ ఆధ్వర్యంలో నవంబర్ 5వ తేదీన బేగంపేటలోని టూరిజం ప్లాజాలో వైశ్యుల బిజినెస్ మీట్ నిర్వహించనున్నట్లు వీబీజీ వ్యవస్థాపకుడు మడిపడిగె రాజు తెలిపారు. వైశ్యుల వ్యాపారాభివృద్ధి కోసం నిర్వహిస్తున్న ఈ సమావేశంలో వైశ్య వ్యాపారులు పాల్గొని తమ వ్యాపార అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో పాల్గొనే వైశ్యులు ఉచితంగానే ముందుగా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. వివరాలకు సెల్: 91215 74282, 89773 86707.

కాచిగూడ రైల్వే స్టేషన్‌లో 'వన్ స్టేషన్-వన్ ప్రొడక్ట్' స్టాల్

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ డాక్టర్ డి.శ్రీనివాస్ ఆదేశాల మేరకు కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 'వన్ స్టేషన్-వన్ ప్రోడక్ట్' స్టాల్‌ను సోమవారం చంచల్‌గూడ జైలు పర్యవేక్షణాధికారి నవాబ్ శివకుమార్ గౌడ్ ప్రారంభించారు. అతి తక్కువ ధరలో నాణ్యతతో కూడిన వస్తువులను స్టాల్‌లో అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. జైలు ఉప పర్యవేక్షణాధికారులు శ్రీనివాస్ రెడ్డి, విజయ్‌కుమార్, కాచిగూడ రైల్వే స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలకు సీట్లు కేటాయించిన పార్టీలకే మద్దతు

కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన పద్మశాలీలకు సీట్లు కేటాయించిన పార్టీలకే పద్మశాలీల పూర్తి మద్దతు ఉంటుందని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి అన్నారు. సోమవారం నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పద్మశాలీలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో పోటీ చేసే అభ్యర్థుల వివరాలను ఆయా పార్టీల అధినేతలను కలిసి వివరించినట్లు తెలిపారు. ముఖ్యంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు పద్మశాలీలను గుర్తించి సీట్లు కేటాయించాలని కోరారు. టికెట్లు కేటాయించకుండా పద్మశాలీలను నిర్లక్ష్యం చేసే పార్టీలను ఓడిస్తామని ఆయన అన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన టీడీపీ నేత ముజఫర్ అలీఖాన్



మలక్‌పేట: టీడీపీ నేత ముజఫర్ అలీఖాన్ తన అనుచరులతో సోమవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మందడి విజయసింహారెడ్డి, ముజఫర్ అలీఖాన్‌లు మలక్‌పేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ అక్బర్‌కు తమ పూర్తి మద్దతు ప్రకటించారు.

మలక్‌పేట కాంగ్రెస్ అభ్యర్థికి నిరసన సెగ

చాదర్‌ఘాట్: మలక్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి సొంత పార్టీ నుంచే నిరసన సెగలు ఎదురవుతున్నాయి. పార్టీ అభ్యర్థి రాజకీయ నాయకుడిగా కాకుండా వ్యాపారవేత్తగా వ్యవహరిస్తున్నాడని, సీనియర్ నాయకులైన తమను పట్టించుకోవడం లేదని పలువురు అలక పూనుతున్నారు. సోమవారం పార్టీ అభ్యర్థి మలక్‌పేటలోని ఒక ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గంలోని ఆరు డివిజన్‌లకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసారు. అయితే ఆయన వ్యవహార తీరు నచ్చని పలువురు డివిజన్ అధ్యక్షులు సహా సీనియర్ నాయకులు గైర్హాజరైనట్లు తెలుస్తోంది. పార్టీ కష్టకాలంలో ఉన్నా అనుచరులను, కార్యకర్తలను ఇంత కాలం కాపాడుకుంటూ వచ్చిన నియోజకవర్గంలోని ఎందరో సీనియర్ నాయకులను కాదని ఎలాంటి రాజకీయ అనుభవం లేని వ్యక్తికి పార్టీ టికెట్ ఇచ్చిందని పలువురు నాయకులు మండిపడుతున్నారు. సరే అధిష్టానం నిర్ణయం కదా సర్దుకుందామంటే, టికెట్ వచ్చిన అభ్యర్థి ఎన్నిలకకు సంబంధించి మొత్తం తన వ్యాపార లావాదేవీలు చూసే వారినే పెట్టుకుంటూ తమ సలహాలు పెడచెవిన పెడుతున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇలా అయితే ఎన్నికల ప్రచారంలో స్థానికంగా తమ వారి ముందే తాము చులకన అవుతామని వారు వాపోతున్నారు.

బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు



షటిల్ ప్లేయర్స్‌తో బీఆర్ఎస్ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి

మలక్‌పేట: బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతాయని ఆ పార్టీ మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి అన్నారు. మూసారంబాగ్ డివిజన్ ఎస్‌బీహెచ్ కాలనీలో సోమవారం షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ సభ్యులను కలిసి బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. దళితబంధు, షాదీముబారక్, కళ్యాణ లక్ష్మి, రైతు బంధు పథకాలను అమలు చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కిందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు దేవిడి శ్రీనివాస్‌రెడ్డి, సామ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి లక్ష్మారెడ్డి

మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కేఎల్‌ఆర్

దిల్‌సుఖ్‌నగర్: గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెలిచి మంత్రి పదవి కోసం పార్టీ మారిన సబితా ఇంద్రారెడ్డిని ఈ ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించి తగిన బుద్ధి చెబుతామమని మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్‌ఆర్) అన్నారు. ఆర్‌కేపురంలోని దేప భాస్కర్ రెడ్డి నివాసంలో కాంగ్రెస్ నేతలతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సబితా ఇంద్రారెడ్డి మంత్రి పదవి దక్కించుకొని నియోజకవర్గంలో కబ్జాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి లాంటి ముఖ్యమంత్రి కావాలని అయన ప్రతిరోజు ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసేవారని తెలిపారు. నియోజకవర్గంలోని ఇంటింటికి వచ్చి సమస్యలు తెలుసుకుని సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. రంగారెడ్డిజిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్ల నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి

హస్తినాపురం: వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలలో పోలింగ్‌బూత్‌లను పరిశీలించడానికి కేంద్ర బలగాలతో కలిసి వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సుష్మాచౌరస్తా నుంచి రైతు బజార్ మీదుగా పోలీసులు సోమవారం రాత్రి వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి పర్యవేక్షణలో సీఐ జలేంధర్ రెడ్డి ఆధ్వర్యంలో పర్యటించారు. ఈ సందర్భంగా వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు రానున్న సాధారణ ఎన్నికలలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేదిలేదన్నారు. కార్యక్రమంలో వనస్థలిపురం సీఐ జలేంధర్‌రెడ్డి, ఎస్ఐలు మాధవరెడ్డి, జగన్, రవి, నర్సింగ్‌రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని గెలిపించాలి

- విద్యాభివృద్ధికి పాటుపడిన సబితారెడ్డి
- ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా



సరూర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా

హుడాకాంప్లెక్స్: మహేశ్వరం నియోజకవర్గం నుంచి మంత్రి సబితారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం సరూర్‌నగర్‌లోని హుడాకాలనీ, అంబేడ్కర్ నగర్, పంజాల అనిల్‌కుమార్ కాలనీలో బీఆర్ఎస్ నాయకులతో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, బీఆర్ఎస్‌ను మరోసారి ఆదరించాలని కోరారు. నియోజకవర్గంలో మంత్రి సబితారెడ్డి వందలాది ఐటీ కంపెనీలను తేవడంతో పాటు మెడికల్ కళాశాల, రెండు డిగ్రీ, జూనియర్ కళాశాలలు, మహిళా పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి పాటుపడ్డారని తెలిపారు. ఇందులో నాయకులు బాలకిషన్, అనితారెడ్డి, అంకిరెడ్డి, మొహమ్మద్ సలీం, రాజేష్‌గౌడ్, నాగమణి, సాలమ్మ, శృతి, సుదర్శన్, విజయేందర్, వినయ్ చారీ, ప్రత్యూష పాల్గొన్నారు.